క్లుప్తంగా

10,11 తేదీల్లో రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలు



చిలకలూరిపేటటౌన్: మూఢ విశ్వాసాలు తొలిగిపోయినప్పుడే దేశం అన్ని రంగాల్లో విజయం సాధిస్తుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ చెప్పారు. శనివారం పట్టణంలోని పండరీపురం సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాస్త్ర ప్రచారంలో జన విజ్ఞాన వేదిక 36 సంవత్సరాలుగా కృషి చేస్తూ అనేక విజయాలు సాధించిందన్నారు. ఫిబ్రవరి 10,11 తేదీలలతో చిలకలూరిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చెకుముకి సైన్సు సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సైంటిఫిక్ టెంపర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఆలిండియా సైన్స్ నెట్‌వర్క్ సభ్యులు శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సోషల్ మీడియా కన్వీనర్ జయప్రకాష్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, ట్రెజరర్ ఎస్.చలపతి రావు, జిల్లాయూత్ అధ్యక్షుడు రమేష్, డివిజన్ అధ్యక్షురాలు సీహెచ్ సృజన తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 'తిరుమల' విద్యార్థులు ఎంపిక



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన సదర్ ల్యాండ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 47 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో వివిధ బ్రాంచ్‌లకు చెందిన 320 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రాతపరీక్ష, బృంద చర్చలు, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించిన అనంతరం విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఉద్యోగాలు సాధించిన వారిలో సీయస్ఈ-25, ఐటీ-13, ఈసీఈ-7, ఈఈఈ-2 ఉన్నట్టు వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

యడ్లపాడులో కులగణన షురు

యడ్లపాడు: మండలంలో కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది వలంటీర్ల బృందం శనివారం ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించారు. ఇంటి నంబర్, కుటుంబ సభ్యుల సంఖ్య, వారి పేరు, వయస్సు, లింగం, విద్యార్హత తదితర వివరాలను తీసుకుంటున్నారు. కుటుంబ సభ్యుల్లోని ఒక్కొక్కరి వివరాలు వేర్వేరుగా నమోదు చేసుకొని చివరిలో వ్యక్తి వేలిముద్రలతో పాటు వివరాలు సేకరించిన అధికారి వేలిముద్రలతో నమోదు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య



రొంపిచర్ల: లోన్ యాప్ ద్వారా అప్పు పొంది తీర్చలేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పరగటిచర్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లో కెళితే.. పరగటిచర్ల గ్రామానికి చెందిన గుడిపూడి విగ్నేష్ (22) గుంటూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఫోన్‌లో యాప్ ద్వారా రూ.10 వేల రూపాయలు అప్పు తీసుకున్నాడు. వాటిని తీర్చమని లోన్‌యాప్ వారు ఒత్తిడి చేయటంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా ఫోన్‌లు చేశారు. ఆ మొత్తాన్ని కుటుంబ సభ్యులు చెల్లించారు. అయితే ఇంకా అప్పు ఉన్నదేమో వారి వేధింపులు తాళలేక శనివారం ఉదయం ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుని తండ్రి శ్యాం ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.రవీంద్ర తెలిపారు. విగ్నేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

కులగణనలో సరైన వివరాలు తెలపాలి



నాదెండ్ల: కులగణన జరుగుతున్నందున ప్రజలు వివరాలను సక్రమంగా తెలపాలని, దీనివల్ల సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. మండలంలో కులగణన శుక్రవారం నుండి ప్రారంభమైంది. ఈ నెల 28 వరకూ జరగనుంది. సంబంధిత అధికారులు గ్రామంలోని ఇళ్లను సందర్శించినపుడు సామాజిక, ఆర్థిక వివరాలతో పాటూ కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా తెలియజేయాలన్నారు. ఇలాంటి వివరాలు వెల్లడించినందునే ప్రజలకు ప్రభుత్వం నుంచి మెరుగైన సత్ఫలితాలు వస్తాయన్నారు. శనివారం ఎండుగుంపాలెం, ఇర్లపాడు గ్రామాలను ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, మండల ప్రత్యేకాధికారి బీజే బెన్నీ, ఎంఈవో ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది సందర్శించి కులగణన ప్రక్రియను పరిశీలించారు.

దళిత ద్రోహి చంద్రబాబే

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు
- తాము అధికారంలోకి వస్తే అంబేడ్కర్ విగ్రహం తొలగించి అమరావతిలో పెడతామని చెప్పడం నీచరాజకీయం
- హత్యారాజకీయాల చరిత్ర మాజీ ఎమ్మెల్యే జీవీదే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): చంద్రబాబు, టీడీపీ నాయకులు అసత్య ప్రచారాలతో ఎన్నికల్లో విజయం సాధించాలని చూస్తున్నారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడ నగరంలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తే టీడీపీ నాయకులకు కళ్లల్లో మంటలు పుడుతున్నాయని, పార్టీకి వచ్చే ఆదరణ చూడలేక అసత్యప్రచారాలు చేస్తున్నారని అన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు దూళ్లిపాళ్ల నరేంద్ర విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించి తాము అధికారంలోకి వస్తే అమరావతిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామనడాన్ని ఖండించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై టీడీపీ కపట ప్రేమ అర్థమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ ప్రజలు వైఎస్సార్ సీపీని తమ సొంత పార్టీగా భావించడం టీడీపీ నాయకులకు మింగుడు పడటం లేదన్నారు. దళితుల ఇళ్లల్లో ఎవరైనా పుట్టాలా అన్న చంద్రబాబు టీడీపీ హయాంలో దళితులను అణగద్రొక్కారని, గతంలో వారి కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. చంద్రబాబే దళిత ద్రోహిగా మిగిలిపోయారని విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 17 మంత్రి పదవులు, ఐదు ఉపముఖ్యమంత్రి పదవులు ఇచ్చారని, టీడీపీ హయాంలో చంద్రబాబు వారి కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీకి వస్తున్న ఆదరణ చూసి మతిభ్రమించి మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.

హత్యారాజకీయాలకు అంబాసిడర్ జీవీ ఆంజనేయులు

వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హత్యా రాజకీయాలు చేయడంలో సిద్ధహస్తుడని, స్వయంగా అతని కంపెనీలో పనిచేసే భాగస్వామిని హత్య చేసిన చరిత్ర మరచిపోయారా అని ప్రశ్నించారు. గ్రామాల్లో అలజడులు సృష్టిస్తూ అమాయక రౌగులను రెచ్చగొడుతూ అల్లర్లు సృష్టిస్తుంది మీరు కాదా అని అన్నారు. చంద్రబాబు డైరెక్షన్‌లో పచ్చని గ్రామాల్లో చిచ్చుపెట్టే విధంగా టీడీపీ నాయకులు ప్రవర్తిస్తున్నారని, ఎన్ని కేసులు ఉంటే మంచి పదవులు ఇస్తామని నారా లోకేష్ బహిరంగానే గొడవలను ప్రోత్సహిస్తున్నారన్నారు. దొంగ నోట్ల మార్పిడి, నకిలీ ఎరువులు, హత్యారాజకీయాలు వంటి నీచరాజకీయాలు నడుపుతుంది జీవీయే అని అన్నారు. టీడీపీ నాయకుల ఉచ్చులో పడి గొడవలకు వెళ్లవద్దని, వారి స్వార్థరాజకీయాలకు బలికావద్దని నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇటీవల వినుకొండ పట్టణంలో యువకులను రెచ్చగొట్టి అల్లర్లకు పాల్పడి తమ పార్టీ నాయకులపై అసత్యప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హత్యా రాజకీయాల చరిత్ర ప్రజలందరికీ తెలుసని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు గుండాల స్వెనోమ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు

- స్వయంగా ఆటలు ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచిన అధికారులు
- పోరాడి గెలుస్తున్న క్రీడా బృందాలు



చిలకలూరిపేటలో బోలింగ్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు



శావల్యాపురంలో క్రీడాసామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



బొల్లాపల్లి మండల స్థాయిలో గెలుపొందిన వాలీబాల్ టీంతో అధికారులు



బొల్లాపల్లిలో వాలీబాల్ ఆడుతున్న ఇరుజట్లు



రొంపిచర్లలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎండీవో మాథ్యుబాబు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీడీవో రంగనాయకులు, శాకమూరి బుచ్చయ్య

చిలకలూరిపేటటౌన్: ఆడుదాం ఆంధ్రలో భాగంగా శనివారం పట్టణంలోని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్, ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్, వేలూరు జెడ్పీహైస్కూల్, పురుషోత్తమపట్నంలో క్రీడా ప్రాంగణంలో క్రికెట్ విభాగంలో పోటీలు కొనసాగాయి. బాలుర, బాలికల విభాగంలో మొత్తం 24 టీంలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో జాకీర్ హుస్సేన్ వీధి, పురుషోత్తమపట్నం, కావూరు, మద్దినగర్, బొప్పూడి, గంగన్నపాలెం, తూర్పు మాలపల్లి, వేలూరు మహిళా జట్లు విజయం సాధించారు. పోటీలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు బోలింగ్ చేసి ప్రారంభిచారు.

బొల్లాపల్లిలో...

బొల్లాపల్లి: ఆడుదాం ఆంధ్రా పోటీలు యువతలో క్రీడా స్ఫూర్తిని కల్గించాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీ బాషా అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. మండల స్థాయిలో కబడ్డీలో వెల్లటూరు, వాలీబాల్‌కు గుమ్మనంపాడు, క్రికెట్‌కు వడ్డెంగుంట, బాడ్మింటన్ బాలికల విభాగంలో గుమ్మనంపాడు, బాలుర విభాగంలో వెల్లటూరు, ఖో ఖోలో బాలికలు విభాగంలో పేరూరుపాడు సచివాలయాలకు చెందిన జట్లు గెలుపొందాయని తెలిపారు. ఆయా టీంలు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాయని ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో జి.శ్రీహరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ ఫైనల్స్‌ను శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో వి.రెడ్డిపాలెం, సంతగుడిపాడు జట్లు తలపడగా వి.రెడ్డిపాలెం జట్టు విన్నర్‌గా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న వి.రెడ్డిపాలెం జట్టు నిర్ణీత ఓవర్‌లో 5 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. 81 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సంతగుడిపాడు జట్టు నిర్ణీత ఓవర్‌లో 5 వికెట్లు నష్టపోయి 78 పరుగులు చేసింది. వి.రెడ్డిపాలెం జట్టును విన్నర్‌గా ప్రకటించారు. క్రికెట్ ఆటలను సందర్శించిన ఎండీవో మాథ్యుబాబు తొలుత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి వెంకటకోటిరెడ్డి, ఈవోపీఆర్డీ శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎన్.కోటిరెడ్డి, ఎన్. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట రూరల్ పరిధిలో...

నరసరావుపేట రూరల్: ఆడుదా ఆంధ్రా మండల స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. పురుషుల క్రికెట్ పోటీలలో పాలపాడు, మహిళల క్రికెట్ పోటీలలో కొండకావూరు జట్లు విజయం సాధించి నియోజకవర్గ స్థాయిపోటీలకు ఎంపికయ్యారు. అలాగే ఖోఖో పోటీలలో లింగంగుంట్ల పురుషుల, మహిళల జట్లు, కబడ్డీ పోటీలలో కాకాని పురుషుల జట్టు, కాకాని మహిళల జట్టు ప్రథమస్థానంలో నిలిచాయి. వాలీబాల్ పోటీలో పమిడిపాడు పురుషుల జట్టు, లింగంగుంట్ల-1 మహిళల జట్టు, బాడ్మింటన్ పోటీలో రావిపాడు-2, ఇస్సప్పాలెం మహిళల జట్టు విజయం సాధించాయి. ఈనెల 10వ తేదీ నుంచి పోటీలు నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లు 24వ తేదీ నుంచి నిర్వహించే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. పోటీలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, మండల కోఆర్డినేటర్ ఝాన్సీరాణి, కె.వి.ప్రసాద్, విజయ సుందరదాసులు పర్యవేక్షించారు.

జాతీయ పోటీల్లో రాణించటానికి దోహదం

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని యువతీ యువకులు జాతీయ స్థాయి క్రీడాల్లో రాణించటానికి ఆడుదాం-ఆంధ్రా క్రీడాపోటీలు ఎంతో దోహదపడతాయని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం-ఆంధ్రా క్రీడా పోటీలు మండల స్థాయిలో ముగింపు సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఎంపికైనా క్రీడాకారులకు క్రీడా సామగ్రితో పాటు నగదు బహుమతులు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ మంచిస్థాయిలో రాణించడానికి విద్యతో పాటు క్రీడాల్లో కూడా నైపుణ్యం ఉన్న వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు యాగసిరి చెన్నమ్మ, మొనపాటి శ్రీనివాసరావు, బీర్నేడి రత్నగిరి, పురేటి నాగేశ్వరరావు, ఈపూరు మార్కెట్ యార్డు చైర్మన్ చుండూరి వెంకటేశ్వర్లు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, ఎంపీటీసీ పోతురాజు, మండల కోఆప్షన్ సభ్యులు దూదెకుల హుస్సేన్, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, మండల ప్రత్యేక అధికారి మూలె వెంకటరెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాగుల రాధాకృష్ణమూర్తి, రాజేష్. పి.వాణి, ఎస్.సుజాత పాల్గొన్నారు.

శభాష్.. చిట్టితల్లులు..

శావల్యాపురం: జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ చూపటం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం-ఆంధ్రా మండలస్థాయి క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థినులు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి (ఇండియా) బాల్‌బ్యాడ్మింటిన్ క్రీడాపోటీల్లో తమసత్తా చూపి పలువురికి ఆదర్శం కావటం చాలా సంతోషంగా ఉందన్నారు. మట్టిలో మాణిక్యాలు అంటే ఇలాగే ఉంటారన్నారు. బాల్‌బ్యాడ్మింటిన్ సీనియర్ విభాగంలో మహారాష్ట్రలో జరిగిన పోటీల్లో ఆకుమళ్ళ సమీరా జాతీయ స్థాయిలో మూడోవ స్థానం పొందటం, అలాగే సబ్ జూనియర్ విభాగంలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వేముల దివ్య ద్వితీయ స్థానం సాధించటం మంచి శుభ పరిణామన్నారు. అనంతరం ఇరువురు క్రీడాకారులను దుశ్శావాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు.

క్రికెట్ విన్నర్‌గా చందవరం సచివాలయం జట్టు

నాదెండ్ల: కనపర్రు గ్రామ శివారు మైనంపాడులో గత మూడు రోజులుగా జరుగుతున్న ఆడుదాం ఆంధ్రాలో భాగంగా క్రికెట్ పోటీలు శనివారంతో ముగిశాయి. చందవరం సచివాలయం జట్టు విన్నర్స్‌గా నిలిచారు. ఇర్లపాడు సచివాలయం జట్టు రన్నర్లుగా నిలిచారు. మొత్తం మండల పరిధిలో 12 జట్లు తలపడ్డాయి. చివరిరోజు శనివారం బ్యాటింగ్ ఎంచుకున్న ఇర్లపాడు జట్టు 10 ఓవర్లకు గాను 5 వికెట్లు కోల్పోయి 86 పరుగులు సాధించింది. ఈ టీంపై చందవరం టీం 8.1 ఓవర్లతో మూడు వికెట్లు కోల్పోయి 55 రన్స్ చేసి లక్ష్యాన్ని ఛేదించింది. చిలకలూరిపేటలో జరిగే నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో చందవరం జట్టు పాల్గొననుంది. గెలుపొందిన చందవరం జట్టును సర్పంచ్ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, ఆడుదాం ఆంధ్రా క్రికెట్ కిట్‌ను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్రీడలు శారీరక ధారుఢ్యంతో పాటూ మానసిక ఉల్లాసాన్ని కలిగించి ఒత్తిడిని దూరం చేస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలతో గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ప్రోత్సహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, నోడల్ అధికారి నాగరాజు, పీఈటీలు శ్రీనివాసరావు, సుబ్బారావు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖోలో సత్తాచాటిన సచివాలయం జట్టు

ఈపూరు: మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర ప్రోగ్రాంలో భాగంగా ముగింపు కార్యక్రమాన్ని మండలంలోని కొచ్చర్ల హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ఎంపీడీవో రంగనాయకులు పాల్గొని ఖోఖో మహిళల విభాగంలో విజయం సాధించిన కొండయాపాలెం సచివాలయ టీంను అభినందించారు.ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. మండలస్థాయిలో ప్రతిభ కనపరిచిన వారు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరచాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గోలి వెంకటేశ్వర్లు, శాకమూరి బుచ్చయ్య పాల్గొన్నారు.



పురుషుల క్రికెట్ పోటీలో విజేతగా నిలిచిన పాలపాడు జట్టు



కనపర్రులో క్రీడాకారులతో ఎంపీపీ రాణి, అధికారులు



కనపర్రులో మండల విన్నర్‌గా నిలిచిన చందవరం సచివాలయం జట్టు

సంక్షేమం, అభివృద్ధికే ప్రభుత్వం పెద్దపీట

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



శంకుస్థాపన చేస్తున్న రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు చెప్పారు. పట్టణంలోని పదో వార్డులో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ. 40 లక్షలతో మూడు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శనివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాలు అవసరమున్నా వాటిని కల్పించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాస రావు, వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ నాయకులు సయ్యద్ బషీర్ మేస్త్రి, పంగులూరి వెంగళరాయుడు, సింగారెడ్డి కోటిరెడ్డి, సయ్యద్ జమీర్, షేక్ అహమ్మద్, పఠాన్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మట్టిఖర్చులకు ఆర్థికసాయం

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామానికి చెందిన షేక్ నబిసాహెబ్ భార్య రసూల్‌బి అనారోగ్యంతో మృతి చెందింది. పార్టీ నాయకుల నుంచి సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు మృతిరాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. మట్టిఖర్చులకు తక్షణ సాయంగా రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల కోటేశ్వరరావు, మద్దరి విజయబాలచంద్రారెడ్డి, సంజీవరెడ్డి, పాలూరి శ్రీనివాసరెడ్డి, బొంతా రమణయ్య, తులం గోవిందు, ఇనాదుల ప్రసన్న తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల వ్యయ పరిమితి పెంచారు

ఎంపీడీవో సీతారామయ్య



ఆరోగ్యశ్రీ నూతన కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: సీఎం వైఎస్ జగనన్న పాలనలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయం పరిమితి రూ. 25 లక్షల పెంచారని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య వెల్లడించారు. శనివారం మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతన ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీతో పాటు లబ్ధిదారులచే బయోమెట్రిక్ నమోదు కార్యక్రమం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని వారికి సకాలంలో వైద్య సేవలు అందించేలా వైద్య ఆరోగ్య సిబ్బంది నేరుగా ఇంటి ముంగిటిలోనే పరిష్కార దిశగా చర్యలు చేపట్టిందన్నారు. రోగి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా అవసరమైన సందర్భాల్లో కార్పొరేటు వైద్యశాలకు రిఫర్ చేసి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయం జి.వాసుబాబు, పంచాయతీ కార్యదర్శులు కొమిటినేని అశోక్‌చౌదరి, ఆళ్ళ యుగంధర్, ఆరోగ్య కార్యకర్త అమరలింగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయం

ఒక్కొక్కరికీ రూ.1లక్ష చెక్కు అందజేసిన అదనపు ఎస్పీలు



హెడ్ కానిస్టేబుళ్ల భార్యలకు చెక్కులు అందజేసిన అదనపు ఎస్పీలు

నరసరావుపేట: ఇటీవల అనారోగ్యం, రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఇరువురు హెడ్‌కానిస్టేబుల్స్ కుటుంబాలకు జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ ఆర్.రాఘవేంద్ర, ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు రూ.1 లక్ష చొప్పున రెండు చెక్కులు అందజేశారు. డిస్ట్రిక్ట్ ఆర్మర్డ్ పోలీస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శేషగిరిరావు గతేడాది అక్టోబరు 21వ తేదీన అనారోగ్యంతో మృతిచెందగా ఆయన సతీమణి మల్లీశ్వరికి, గతేడాది నవంబరు 29వ తేదీన కోటప్పకొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై మృతిచెందిన చిలకలూరిపేట రూరల్ హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటేశ్వర్లు సతీమణి తడవర్తి మేనకాదేవికి పోలీస్ అసోసియేషన్ తరపున రూ.1 లక్ష చెక్కు అందజేశారు. పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకే ఓటు

నాదెండ్ల: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగులకు, 80 ఏళ్ల పైబడి మంచానికే పరిమితమైన వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారి బీజే బెన్నీ, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, బీఎల్‌వోలతో కలిసి ఎండుగుంపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే బీఎల్‌వోలు ఓటర్ల జాబితాను పరిశీలించి దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడి మంచానికే పరిమితమైన వృద్ధులను గుర్తించి మ్యాపింగ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో ఓ ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఈవీఎం సాయంతో వారి గృహానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు.

రాజకీయ పార్టీల నాయకులు ఎవరూ దివ్యాంగులు, వృద్ధులపై ప్రభావం ఉండకూడదన్న ఉద్దేశంతో ఎన్నికల సంఘం ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 18 ఏళ్ల పైబడి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు పొందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు.

ఘనంగా ఏబీవీపీ తిరంగా యాత్ర



భారీ జాతీయ పతాకంతో ఊరేగింపు నిర్వహిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో పట్టణంలో 75 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా తిరంగా యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ గుంటూరు విభాగ్ కన్వీనర్ ప్రసాద్ మాట్లాడుతూ 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తిరంగా యాత్రను దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా పట్టణంలో తిరంగా యాత్రను నిర్వహించడం జరిగినది. తిరంగ యాత్రలో దాదాపు 550 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తిరంగా యాత్రను పారిశ్రామికవేత్త రామిశెట్టి సుబ్బారావు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి పరిషత్ కార్యకర్తలు వరుణ్, గోపీ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలతో యాత్ర ఆసాంతం ఉత్సాహభరితంగా జరిగింది.

దేవాలయం పరిశుభ్రత

సత్తెనపల్లి: దేవాలయాలు విశ్వాసానికి చిహ్నాలని, మనసుకు శాంతి కలిగిస్తాయని పూజారి ఎ.ప్రేమ్‌కుమార్ అన్నారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో రెల్వే గేటు సమీపంలోని కోదండ రామసాయి ఆలయ శుద్ధి కార్యక్రమం హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సస్యరక్షణపై అవగాహన

వినుకొండ(నూజెండ్ల): మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలపై వినుకొండ రూరల్ మండలం ఉప్పరపాలెం గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్ పాల్గొని నల్ల తామర పురుగు ఆశించిన పంటలను పరిశీలించి చర్యలను తెలియజేశారు.